**1 :**

మెరుగు చెంగట నున్న మేఘంబు కైవడి
 నువిద చెంగటనుండ నొప్పువాడు
చంద్రమండల సుధాసారంబు పోలిక
 ముఖమున జిరునవ్వు మొలచువాడు
వల్లీయుత తమాల వసుమతీజముభంగి
 బలువిల్లు మూపున బరగువాడు
నీలనగాగ్ర సన్నిహితభానుని భంగి
 ఘనకిరీటము దల గల్గువాడు
పుండరీకయుగము బోలు కన్నులవాడు
వెడద యురమువాడు విపులభద్ర
మూర్తివాడు రాజముఖ్యుడొక్కరుడు నా
కన్నుగవకు నెదుర గానబడియె.

**2 :**

హరినామకథన దావానల జ్వాలల
 గాలవే ఘోరాఘ కాననములు
వైకుంఠ దర్శన వాయుసంఘంబుచే
 దొలగవే బహుదు:ఖ తోయదములు
కమలనాభధ్యాన కం**ఠీర**వంబుచే
 గూలవే సంతాప కుంజరములు
నారాయణ స్మరణ ప్రభాకర దీప్తి
 దీరవే షడ్వర్గ తిమిరతతులు

నళిననయన భక్తి నావ చేగాక సం
సార జలధిదాటి చనగరాదు
వేయునేల మాకు విష్ణుప్రభావంబు,
దెలుపవయ్య సూత ! ధీసమేత !

3:

ఎవ్వని గుణజాల మెన్న జిహ్వలు లేక
 నళినగర్భాదు లనంతు డండ్రు
కోరెడు విబుధేంద్రకోటి నొల్లక లక్ష్మి
 ప్రార్థించె నెవ్వని పాదరజము
బ్రహ్మ ఎవ్వని పాదపద్మంబు గడిగిన
 జలము ధన్యత నిచ్చె జనుల కెల్ల
భగవంతు డనియెడి భద్రశబ్దమునకు
 నెవ్వ డర్థాకృతి నేపుమిగులు

నే మహాత్ము నాశ్రయించి శరీరాది
సంగకోటినెల్ల సంహరించి
ప్రాభవమున మునులు పారమహంస్యంబు,
నొంది తిరిగి రాక యుందు రెలమి.

4:

ఆకార జన్మ విద్యార్థ వరిష్ఠు డై
 గర్వ సంస్తంభ సంగతుడు గాడు
వివిధ మహానేక విషయసంపన్నుడై
 పంచేంద్రియములచే బట్టువడడు
భవ్య వయో బాల ప్రాభవోపేతుడై
 కామ రోషాదుల గ్రందుకొనడు
కామినీ ప్రముఖ భోగము లెన్నిగలిగిన
 వ్యసన సంసక్తి నా వంక బోడు

విశ్వమందు గన్న విన్న యర్థములందు
వస్తుదృష్టి జేసి వాంఛ యుడడు
ధరణినాథ ! దైత్య తనయుండు హరిపర
తంత్రు డై హతాన్యతంత్రు డగుచు.

**5**:

మందార మకరంద మాధుర్యమున దేలు
   మధుపంబు వోవునే మదనములకు ?
నిర్మల మందాకినీ వీచికల దూగు
   రాయంచ చనునె తరంగిణులకు ?
లలిత రసాల పల్లవ ఖాది యై చొక్కు
   కోయిల సేరునే కుటజములకు ?
బూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరక
        మ్మరుగునే సాంద్ర నీహారములకు ?

అంబుజోదర దివ్య పాదారవింద
చింతనామృత పానవిశేష మత్త
చిత్త మేరీతి నితరంబు జేరనేర్చు
వినుతగుణశీల ! మాటలు వేయునేల ?

**6**:

పల్వలంబుల లేత పచ్చిక మచ్చిక
   జెలుల కందిచ్చు నచ్చికము లేక
నివురు జొంపముల గ్రొవ్వేలయు పూగొమ్మల
   బ్రాణవల్లభలకు బాలు వెట్టు
ఘన దాన శీతల కర్ణతాళంబుల
   దయితల చెమటార్చు దనువు లరసి
మృదువుగాగొమ్మల మెల్లన గళములు
   నివురుచు బ్రేమతో నెఱపు వలపు

పిరుదు చక్కట్ల దగ్గని ప్రేమతోడ
డాసి మూర్కొని దివికి దొండంబు సాపు
పెద వివేకించు గ్రీడించు విశ్రమించు
మత్త మాతంగమల్లంబు మహిమతోడ .

**7**:

భుగభుగాయిత భూరి బుద్బుదచ్ఛటలతో
   గదలుచు దివికి భంగంబు లెగయ
భువన భయంకర పూత్కార రవమున
   ఘోర నక్ర గ్రాహకోటి బెగడ
వాలవిక్షేప దుర్వార ఝుంఝూనిల
   వశమున ఘుమఘుమావర్త మడర
గల్లోల జాల సంఘట్టనంబుల దటీ
   తరులు మూలములతో ధరణి గూల
సరసిలోనుండి పొడగని సంభ్రమించి
యుదిరి కుప్పించి లంఘించి హుంకరించి
భాను గబళించి పట్టు స్వర్భానుపగిది
నొక్క మకరేంద్రు డిభరాజు నొడిసి పట్టె.

**8.**

స్వచ్ఛంబులై పొంగె జలరాసు లేడును
   గల ఘోషణముల మేఘంబు లురిమె
గ్రహతారకలతోడ గగనంబు రాజిల్లె
   దిక్కులు మిక్కిలి తెలివి దాల్చె
గమ్మని చల్లని గాలి మెల్లన వీచె
   హోమానలంబు చెన్నొంది వెలిగె
గొలకులు కమలాళి కులములై సిరి నొప్పె
   బ్రవిమలతోయ లై పాఱె నదులు
వర పుర గ్రామ ఘోష యై వసుధ యొప్పె
విహగ రవ పుష్ప ఫలముల వెలసె వనము
లలరు సొనలు గురిసి రయ్యమరవరులు
దేవదేవుని దేవకీదేవి కనగ.

**9.**

వేదాంతవీధుల విహరించు విన్నాణి
   విహరించు గాంతార వీధులందు
ఫణిరాజ శయ్యపై బవళించు సుఖభోగి
   పల్లవశయ్యల బవ్వళించు
గురుయోగి మానస గుహల గ్రుమ్మరు మేటి
   గ్రుమ్మరు నద్రీంద్ర గుహలలోన
గమలతోడ బెనంగి కడు డయ్యు చతురు డా
   భీరజనులతోడ బెనగి డయ్యు

నఖిలలోకమునకు నాశ్రయుం డగు దీరు
డలసి తరులనీడ నాశ్రయించు
యాగ భాగచయము లాహరించు మహాత్ము
డడవిలోని ఫలము లాహరించు.

**10.**

కట్టంగ పచ్చని పట్టుపుట్టము దోయి
   ముదితకు దెచ్చి సముద్రు డిచ్చె
మత్తాళినికరంబు మధు వాన మూగిన
   వైజయంతీ మాల వరుణు డిచ్చె
గాంచన కేయూర కంకణ కింకిణీ
   కటకాదులను విశ్వకర్మ యిచ్చె
భారతి యొక్క మంచి తారహారము నిచ్చె
   బాణిపద్మము నిచ్చె బద్మభవుడు
కుండలివ్రజంబు కుండలముల నిచ్చె
శ్రుతులు భద్రమైన నుతులు సేసె
నెల్లలోకములకు నేలికసాని పై
బ్రతికె దనుచు దిశలు పలికె నధిప !

11.

కంజాక్షునకు గాని కాయంబు కాయమే ?
   పవన గుంభిత చర్మభస్త్రిగాక
వైకుంఠు బొగడని వక్త్రంబు వక్త్రమే ?
   ఢమ ఢమ ధ్వని తోడి ఢక్క గాక
హరిపూజనము లేని హస్తంబు హస్తమే ?
   తరుశాఖ నిర్మిత దర్వి గాక
కమలేశు జూడని కన్నులు కన్నులే ?
   తను కుడ్య జాల రంధ్రములు గాక
చక్రిచింత లేని జన్మంబు జన్మమే ?
తరళ సలిల బుద్బుదంబు గాక
విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుడే ?
పాదయుగముతోడి పశువు గాక.

12.

సంతుష్టు డీ మూడుజగముల బూజ్యుండు
   సంతోషి కెప్పుడు జరుగు సుఖము
సంతోషి గాకుంట సంసార హేతువు
   సంతసంబున ముక్తిసతియు దొరకు
బూటపూటకు జగంబున యదృచ్ఛాలాభ
   తుష్టిని దేజంబు తోన పెరుగు
పరితోషహీనత బ్రభ చెడిపోవును
   జలధార ననలంబు సమయునట్లు
నీవు రాజ వనుచు నిఖిలంబు నడుగుట
తగవు గాదు నాకు దగినకొలది
యేను వేడికొనిన యీ పదత్రయమును
చాల దనక యిమ్ము చాలు చాలు.

13.

మాటిమాటికి వ్రేలు మడిచి యూరించుచు
   నూరుగాయలు దినుచుండు నొక్క
డొకని కంచములోని దొడిసి చయ్యన మ్రింగి
   చూడు లేదని నోరు సూపు నొక్క
డేగు రార్గుర చల్దు లెలమి బన్నిదమాడి
   కూర్కొని కూర్కొని కుడుచు నొక్క
డిన్నియు దగ బంచి యుడుట నెచ్చెలి తన
   మనుచు బంతెనగుండు లాడు నొకడు
కృష్ణు జూడు మనుచు గికురించి పరు మ్రోలి
మేలి భక్ష్య రాశి మెసగు నొకడు
నవ్వు నొకడు సఖుల నవ్వించు నొక్కడు
ముచ్చటాడు నొకడు మురియు నొకడు.

14.

కులమువారల కియ్యకోలైన దిల్లాలు
   వరుసతో రక్షించువాడు తండ్రి
ప్రియముతో జన్నిచ్చి పెంచిన యది తల్లి
   తనకు దోడగువాడు తమ్ముడరయ
నాపదం బెడ బాపు నాతండు బంధుండు
   వంచన సేయని వాడె భటుడు
మోక్షమార్గము చూపు ముఖ్యుడే యాచార్యు
   డాత్మకు నిష్టమౌ నతడు సఖుడు
ఎఱిగి వీరలతో బొందు నెఱపవలయు
గురుతెరింగిన సద్వివేకులకు నెల్ల
కలిత లక్ష్మీశ సర్వ జగన్నివేశ
విమల రవికోటి సంకాశ వేంకటేశ

15.

కెలకులనున్న తంగెటి జున్ను గృహమేధి
   యజమాను డంక స్థితార్థ పేటి
పండిన పెరటి కల్పకము వాస్తవ్యుండు
   దొడ్డిబెట్టిన వేల్పుగిడ్డి కాపు
కడలేని యమృతంపు నడబావి సంసారి
   సవిధ మేరునగంబు భవనభర్త
మరుదేశ పథ మధ్యమ ప్రప కులపతి
   యాకటి కొదవు సస్యము కుటుంబి
బధిర పంగ్వంధ భిక్షుక బ్రహ్మచారి
జటి పరివ్రాజకాతిథిక్షపణ కావ
ధూత కాపాలికాద్యనాథులకు గాన
భూసురోత్తమ! గార్హస్థ్యమునకు సరియె ?